
బాబోయ్.. తెగ తాగేశారు..!



కర్నూలు(అర్బన్), జనవరి 1:

కొత్త సంవత్సరం వేడుకల్లో మందుబాబులు రికార్డు సృష్టించారు. ఎన్నడూ లేనంతగా తెగ తాగేశారు. స్టార్ హీరో సినిమా ఓపెనింగ్ కలెక్షన్స్‌ను తలపించేలా లిక్కర్ సేల్స్ కనిపించాయి. డిసెంబరు 31 ఆదివారం కావడంతో... మందుబాబులు బరిలో దిగి సత్తా చాటారు. బీర్లతో పాటు హార్డ్ కూడా భారీగానే అమ్ముడుపోయింది. ఉమ్మడి జిల్లాలో డిసెంబరు 31న ఒక్క రోజే రూ.8.53,20,870 కోట్ల మద్యం తాగేశారు. ఆదివారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎక్సైజ్ శాఖ అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం దుకాణాలను తెరిచి ఉంచారు. దీంతో షాపుల ముందు మద్యం ప్రియులు, ముఖ్యంగా యువకుల రద్దీ కనిపించింది. కొత్త మద్యం పాలసీ ప్రకారం మద్యం దుకాణాలను కుదించినా వ్యాపారం జోరుగా సాగింది. పెరిగిన మద్యం ధరలను సైతం లెక్క చేయకుండా మందు బాబులు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు మద్యం ఏరులై పారింది. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది భారీగా మద్యం అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ అధికారుల రికార్డులు చెబుతున్నాయి.



- ఉమ్మడి జిల్లాలో జోరుగా లిక్కర్ బిజినెస్
- ఒక్క రోజులో రూ.8.53 కోట్ల వ్యాపారం
- మద్యం దుకాణాలు, బార్లు కిటకిట
- విందులు, వినోదాలతో చిందులు

అమ్మకాలతో దుకాణాలు కిటకిట..

కర్నూలు జిల్లాలో 95 దుకాణాలు, 27 బార్లు ఉండగా వాటి ద్వారా రూ.5,08,20,870, నంద్యాల జిల్లాలో 92 మద్యం దుకాణాలు, 21 బార్ల ద్వారా రూ.3.45 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయని సెబ్ అధికారులు తెలిపారు. కొత్త మద్యం పాలసీలో భాగంగా ఉమ్మడి జిల్లాలో 205 దుకాణాలుండగా 40 శాతం కుదించి 192 దుకాణాల ద్వారా మద్యం అమ్మకాలను ప్రభుత్వమే ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తోంది. గత ఏడాది రూ.7.33 కోట్ల మద్యం అమ్మకాలు జరగ్గా ఈ ఏడాది ప్రభుత్వ మద్యం దుకాణాలను కుదించినా కూడా దాదాపుగా రూ.8.53 కోట్ల మద్యం అమ్మకాలు జరగడంపై ఎక్సైజ్ అధికారులు సైతం నివ్వెరపోతున్నారు. కర్నూలు నగరంలో ఒక్కో దుకాణంలో ఎన్నడూ లేని విధంగా ఒక్కరోజు రూ.12 లక్షల దాక వ్యాపారం జరిగింది. నంద్యాల, ఆదోని, డోన్, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు పట్టణాల్లో కూడా గతంలో కంటే అమ్మకాలు భారీగానే జరిగాయి. ఇక బార్లు సైతం అర్ధరాత్రి దాటినా కూడా కిక్కిరిసి కనిపించాయి. ఉమ్మడి జిల్లాలోని 48 బార్లలో కూడా రాత్రి ఒంటిగంట తర్వాత కూడా అమ్మకాలు జోరుగా సాగాయి.





మందుబాబుల హల్‌చల్..

పట్టణాలు, మండల కేంద్రాల్లో నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. కర్నూలు నగరంలో మందుబాబులు తప్పతాగి చిందులేశారు. రోడ్లపై బైక్‌లతో చక్కర్లు కొట్టారు. బైక్‌ల సైలెన్సర్లను తొలగించి రైజ్ చేస్తూ భారీ శబ్దాలతో హంగామా సృష్టించారు. విజిల్స్, కేకలు వేస్తూ కనిపించారు. బాణసంచా పేలుస్తూ వేడుకలు నిర్వహించుకున్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు పోలీసుల ఆంక్షలు అమల్లో ఉన్నప్పటికీ యువత మద్యం మత్తులో చిందులేసింది. పార్టీలు, విందులు, వినోదాలతో అర్ధరాత్రి 12 గంటలకు నూతన సంవత్సరం వేడుకలను నిర్వహించుకున్నారు. కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్ నుంచి బళ్లారి వెళ్లే రహదారి, వెంకటరమణ కాలనీ, పాతబస్తీ, నంద్యాల చెక్ పోస్టు పరిధిలోని జోహరాపురం రోడ్డులో యువత చిందులేస్తూ, బైక్‌లపై విన్యాసాలు చేస్తూ కేరింతలు కొడుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 1 : జిల్లాలో బుధవారం నుంచి పింఛన్ రూ.3వేలును అందజేయనున్నట్లు కలెక్టర్ జి.సృజన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3,374 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. 2,45,278 మందికి పింఛన్లను రూ.73.44 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. బుధవారం నుంచి 8వ తేదీ వరకు సామాజిక పింఛన్ల పంపిణీ ఉంటుందన్నారు.

డివిజనల్ సబ్ ట్రెజరీ కార్యాలయంలో కౌంటర్లు

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 1: రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంతి ఉద్యోగులు, కుటుంబ పింఛనుదారుల జీవన ప్రమాణపత్రం నమోదు కోసం కర్నూలు డివిజనల్ సబ్ ట్రెజరీ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను జిల్లా ఖజానా అధికారి బి.రామచంద్రరావు లాంచనంగా ప్రారంభించారు. ఈ నెల నుంచి ఫిబ్రవరి 29వ తేదీ వరకు ఉచితంగా నమోదు చేసుకోవచ్చన్నారు.

కోలాహలం

- జిల్లా అంతట సందడే సందడి
- అట్టహాసంగా నూతన సంవత్సర వేడుకలు
- ఆలయాల్లో పూజలు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- అధికారులు, నేతల కార్యాలయాల్లో కేక్ కటింగ్‌లు

కర్నూలు(కల్చరల్), జనవరి 1: నూతన సంవత్సరం..2024కు జిల్లా వాసులు ఘనంగా స్వాగతం పలికారు. న్యూ ఇయర్ రోజున వేడుకలు అంబరాన్ని అంటాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన వేడుకలు సోమవారం సాయంత్రం వరకు జరిగాయి. చర్చిలు, ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు, పూజలు జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు వాడవాడలా ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. కేక్ కటింగ్‌లు, ఒకరినొకరు న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెప్పుకుంటూ చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా సందడి చేశారు. నూతన సంవత్సరాన్ని ప్రజలు ఘనంగా ఆహ్వానించారు. పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వేడుకలు జరుపుకున్నారు.


కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో...

కర్నూలు(కలెక్టరేట్): నూతన సంవత్సర వేడుకలు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు జిల్లా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు, ఎన్జీఓలు కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో జిల్లాను అభివృద్ధి పథంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహాయ, సహకారాలు అందించాలన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రజలు మెచ్చే రీతిలో సమష్టిగా నూతనోత్తేజంతో పని చేద్దామన్నారు. జేసీ నారపురెడ్డి మౌర్యని రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్, జేసీ కుటుంబ సభ్యులు

ఎఫ్ఆర్‌సీ బదులు ఎన్ఎంసీ బయోమెట్రిక్


మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఎన్ఎంసీ బయోమెట్రిక్ యంత్రాలు

కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్యులకు అమలు

కర్నూలు(హాస్పిటల్), జనవరి 1: ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో వైద్యులు ఫోన్ ద్వారా వేసే ఫేషియల్ రికగ్నైజ్ యాప్ (ఎఫ్ఆర్‌సీ)ను రద్దు చేశారు. దాని స్థానంలో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఆధారిత బయోమెట్రిక్ హాజరు విధానం (ఏఈబీఏఎస్) అమలులోనికి వచ్చింది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో పని చేసే వైద్యులకు ఇక నుంచి ఎన్ఎంఏ-ఏఈబీఏఎస్ బయోమెట్రి హాజరు తప్పనిసరని అన్నారు.

ఎన్ఎంసీ బయోమెట్రిక్ కేవలం క్లినికల్ నాన్ క్లినికల్ వైద్యులకు మాత్రమే వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎన్ఎంసీ బయోమెట్రిక్‌లో ఫింగర్‌ప్రింట్ బయోమెట్రి, రెండోది ఫేస్ ఆధారిత బయోమెట్రిలో ఒక దానిని మాత్రమే వైద్యులు వేయాల్సి ఉంటుంది. జనవరి ఒకటో తేదీ నుంచి ఎన్ఎంసీ బయోమెట్రిక్‌ను కర్నూలు మెడికల్ కాలేజీ వైద్యులు ఉదయం 9 గంటలకు సాయంత్రం 4 గంటలకు రెండుసార్లు వేయాల్సి ఉంటుంది. ఇటీవల కాలంలో ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో వైద్యుల హాజరు 75 కంటే తక్కువగా నమోదు అవుతుండటంతో నేషనల్ మెడికల్ కమిషన్ దీనిపై దృష్టి పెట్టింది. డీఎంఈ ఆదేశాల మేరకు బయోమెట్రిక్ ఖచ్చితంగా పాటించాలి.

ఎఫ్ఆర్ఎస్‌లో మార్పులు



డీఎంఈ ఆదేశాల మేరకు ఎఫ్ఆర్ఎస్‌లో మార్పులు వచ్చాయి. ఎన్ఎంసీ బయోమెట్రి హాజరును వైద్యులు తప్పనిసరిగా వేయాలి. జనవరి 1 నుంచి ఎన్ఎంసీ ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు విధానం (ఏఈబీఏఎస్) అమల్లోనికి వచ్చింది. ఎన్ఎంసీ బయోమెట్రిక్ హాజరు కోసం కర్నూలు మెడికల్ కాలేజీలో 6 బయోమెట్రిక్ యంత్రాలను 391 మంది వైద్యుల కోసం ఏర్పాటు చేశాం.

- డాక్టర్ పి.సుధాకర్, ప్రిన్సిపాల్, కర్నూలు మెడికల్ కాలేజీ

ఇది డాక్టర్లకు మాత్రమే



ఎన్ఎంసీ ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు విధానం (ఏఈబీఏఎస్) కేవలం ప్రభుత్వ ఆసుపత్రిలోని క్లీనికల్ నాన్ క్లీనికల్ వైద్యులకు మాత్రమే. ఆసుపత్రిలోని మిగిలిన ఉద్యోగులు, సిబ్బంది పాత ఎఫ్ఆర్ఎస్ బయోమెట్రిని వేయాల్సి ఉంటుంది.

- డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, సూపరింటెండెంట్, కర్నూలు ప్రభుత్వాసుపత్రి


కోడుమూరులో కోట్లసూర్యప్రకాశ్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


కర్నూలు టీడీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడుకు శుభాకాంక్షలు


మంత్రాలయంలో తిక్కారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ నాయకులు


కర్నూలు సిటీలో టీజీ భరత్ ఆధ్వర్యంలో...


నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్...


ఆదోనిలో టీడీపీ నాయకుడు బత్తిన లక్ష్మీనారాయణ...

టీడీపీ నేతల్లో న్యూ ఇయర్ జోష్

కర్నూలు(అర్బన్), జనవరి 1: పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి ఘన స్వాగతం పలుకుతూ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌ను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ నేతలకు అభిమానులు, పార్టీ కార్యకర్తలు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేశారు. కర్నూలు టీడీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడుకు పార్టీ శ్రేణులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా కోడుమూరులో మాజీ కేంద్రమంత్రి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్, ఎమ్మిగనూరులో మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి, పత్తికొండలో కేఈ శ్యాంబాబు, మంత్రాలయంలో తిక్కారెడ్డి, పాణ్యం, ఓర్వకల్లు, కల్లూరు మండలాల్లో మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టీడీపీ నేత గౌరు వెంకటరెడ్డికి టీడీపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఆదోనిలో టీడీపీ నాయకుడు, పారిశ్రామికవేత్త బత్తిన లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో న్యూ ఇయర్ వేడుకలు జరిగాయి.


ఎమ్మిగనూరులో మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డికి సత్కారం


పత్తికొండ టౌన్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు...


గౌరు చరిత, వెంకటరెడ్డి సమక్షంలో న్యూ ఇయర్ వేడుకలు

'కాబోయే సీఎం చంద్రబాబే'


పూజలు చేస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జనవరి 1: త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. సోమవారం కడప పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ గెలుపొందాలని, ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయాలని ఆ దేవుడ్ని ప్రార్థించినట్లు తెలిపారు. నూతన సంవత్సరంలో రాష్ట్రానికి దరిద్రం పోతుందని, వైసీపీ ఎన్నికల్లో గల్లంతు కావడం తథ్యమని అన్నారు.

ఐదో తేదీలోగా విధులకు హాజరు కావాలి
అంగన్‌వాడీలకు కలెక్టర్ విజ్ఞప్తి

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 1: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి 5వ తేదీలోపు అంగన్‌వాడీ ఉద్యోగులు విధులకు హాజరు కావాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 11 డిమాండ్లతో డిసెంబరు 12 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. కొన్ని డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. దీనికి సంబంధించి జీవోలను కూడా ప్రభుత్వం జారీ చేసిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీలో జరుగుతున్న అంతరాయం వల్ల బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించి విధులకు రావాలన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఒక వేళ సమ్మె విరమించకపోతే ప్రభుత్వ నిబంధనల మేరకు శాఖాపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వో మృతి

ఆళ్లగడ్డ, జనవరి 1: చాగలమర్రి మండలంలోని శెట్టివీడు సచివాలయంలో వీఆర్వోగా పనిచేస్తున్న వెంకటలక్ష్మమ్మ(40) ఆళ్లగడ్డ మండలంలోని చింతకొమ్మ దిన్నె వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ప్రమాదంలో ఆమె భర్త నరసింహుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆళ్లగడ్డ మున్సిపాల్టీ పరిధిలోని పడకండ్ల గ్రామంలో నివాసం ఉంటున్న వీఆర్వో వెంకట లక్షమ్మ మోటార్ సైకిల్‌పై భర్త నరసింహుడుతో కలిసి సచివాలయానికి బయల్దేరారు. కోటకందుకూరు గ్రామానికి ఇస్మాయిల్ మోటార్‌సైకిల్‌పై కుటుంబంతో వెళ్తుండగా రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వీఆర్వో మృతి చెందారు. గాయపడిన వారిని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు 108 వాహనంలో తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి హత్య

- తాగిన మైకంలో దాడిచేసిన వైసీపీ కార్యకర్తలు
- నూతన సంవత్సర వేడుకల్లో విషాదం
- 12 మంది పై కేసు నమోదు చేసిన పోలీసులు


ఖాధర్ (ఫైల్)

డోన్, జనవరి 1: నూతన సంవత్సర వేడుకల్లో పాత కక్షలు భగ్గుమని ఓ యువకుడి హత్యకు దారితీశాయి. సోమవారం తెల్లవారుజామున డోన్ మండలంలోని ఉంగరానిగుండ్ల గ్రామంలో జరిగిన ఈ ఘటనలో డోన్‌కు చెందిన ఖాదర్ (30) అనే యువకుడు మృతి చెందాడు. డోన్ పట్టణంలోని చిగురుమాను పేటకు చెందిన ఖాదర్ తండ్రి లక్ష్మీనారాయణ ఉంగరానిగుండ్లలో నివాసం ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు చిన్నమద్ది కుమారుడు ఓబులేసుకు, ఖాదర్‌కు కొన్ని నెలల క్రితం ఘర్షణ జరిగింది. దీంతో ఇరువర్గాల మధ్య కక్షలు పెరిగాయి. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ఖాదర్ ఆదివారం రాత్రి డోన్ పట్టణంలో తన స్నేహితులతో కలిసి వేడుకలు జరుపుకున్నాడు. ఆ సమయంలో ఉంగరానిగుండ్ల గ్రామంలో వైసీపీకి చెందిన వ్యక్తులు లక్ష్మీనారాయణ ఇంటి మీద దాడి చేశారు. ఇందులో ఖాదర్ తమ్ముడు రవి గాయపడ్డాడు. ఈ విషయం తెలిసి ఖాదర్ తన స్నేహితులతో కలిసి ఉంగరానిగుండ్లకు వెళ్లాడు. వైసీపీ నాయకుడు చిన్నమద్ది కుమారులు, అనుచరులు రెచ్చిపోయి రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఖాదర్ తలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా ఖాదర్ మార్గమధ్యంలోనే మృతి చెందాడు. దీంతో మృతుని కుటుంబ సభ్యులు ఉదయం పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. పోలీసుస్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. మృతుని తండ్రి లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 12 మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఉంగరానిగుండ్ల గ్రామానికి చెందిన ఓబులేసు, సిసింద్రీ, నవీన్, చిన్న మధు, చిన్నమద్ది, అబ్దుల్, ఖాజా, అహ్మద్, షరీఫ్, మను, రంగస్వామి, పవన్‌లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైతులకు అండగా ఉందాం : కేడీసీసీబీ చైర్‌పర్సన్

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 1: జిల్లా కేంద్ర సహకార బ్యాంకును అన్ని విధాలుగా ప్రగతిపథంలో నడిపించి రైతులకు అండగా ఉందామని చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలు నగరంలోని ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రాంగణంలో నూతన సంవత్సరం సందర్భంగా అధికారులు, సిబ్బందితో కలసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర కేక్‌ను కట్ చేశారు. అనంతరం చైర్‌పర్సన్ విజయ మనోహరి మాట్లాడుతూ కేంద్ర సహకార బ్యాంకు లక్ష్యాలను సాధించేందుకు అధికారులు, సిబ్బంది సమష్టి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో రామాంజనేయులు, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, సునీల్ కుమార్, ఏజీఎం శివలీల, త్రినాథ్ రెడ్డి ఉన్నారు.


సహకార బ్యాంకులో నూతన సంవత్సర వేడుకల్లో చైర్‌పర్సన్ విజయ మనోహరి

జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా శ్రీనివాసులు



డీఈఓను కలిసి బొకే అందజేస్తున్న శ్రీనివాసులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 1: జిల్లా విద్యాశాఖ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఎ.శ్రీనివాసులు సోమవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. కర్నూలు ఐఏఎస్ఈలో వి.శ్రీనివాసులు సూపరింటెండెంట్‌గా పని చేస్తూ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. గతంలో ఈ పోస్టులో ప్రకాష్‌రెడ్డి పని చేస్తూ బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి అసిస్టెంట్ డైరెక్టర్‌గా శ్యాముల్ పాల్ ఇన్‌చార్జి బాధ్యతలు కొనసాగిస్తూ వచ్చారు. రెగ్యులర్ ఏడీగా శ్రీనివాసులు రాకతో ఈ పోస్టు భర్తీ అయింది. ఏడీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు డీఈవో రంగారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

యువకుడిపై దాడి

ఎమ్మిగనూరు, జనవరి 1: ఎమ్మిగనూరు పట్టణ పరిధిలోని లక్ష్మీపేటకు చెందిన యువకుడు షేక్ మహబూబ్‌బాషాపై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. లక్ష్మీపేటకు చెందిన షేక్ చాంద్‌బాషా కుమారుడు మహబూబ్‌బాషా ఆదివారం అర్ధరాత్రి మాచాని సోమప్ప స్కూల్ దగ్గర ఉండగా...కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు కట్టెలతో దాడి చేశారు. దీంతో మహబూబ్‌బాషా తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు యువకుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో కర్నూలుకు తరలించారు. బాధితుడి అన్న షేక్ అలిభాషా ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు


మంఠం ప్రాంగణంలో భక్తుల రద్దీ

మంత్రాలయం, జనవరి 1. రాఘవేంద్ర స్వామి దర్శనార్థం మంత్రాలయంలో భక్తులు పోటెత్తారు. సోమవారం నూతన సంవత్సరం కావటంతో దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులు పొందారు.

ఆసుపత్రిలో సమూల మార్పులు

» ఇక రాత్రిళ్లు ఆకస్మిక తనిఖీలు
» సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్), జనవరి 1: ఎంతో నమ్మకంతో సుదూర ప్రాంతాల నుంచి అనేక మంది రోగులు ఇక్కడకు వస్తున్నారని, వారికి తగిన వైద్యం అందించేలా ఈ ఏడాది ప్రభుత్వ ఆస్పత్రిలో సమూల మార్పులు తెస్తున్నామని సూపరింటెండెంట్ డా.వి. వెంకటరంగారెడ్డి తెలిపారు. సోమవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో వైద్యులు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాజువాల్టీలో ప్రతిరోజు రాత్రి మెడిసిన్ విభాగానికి 60 నుండి 70 మంది ఇన్ పేషెంట్లు వస్తుంటారని అన్నారు. వీరందరికీ ఒక్క అసిస్టెంట్ ప్రొఫెసర్ చికిత్స అందించలేరని, రాత్రిళ్లు ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఉంచాలని ఆదేశించామని తెలిపారు. గైనిక్, ఆర్థో, అనస్థీషియా విభాగాలకు ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు క్యాజువాల్టీ, ఏఎంసీల్లో అందుబాటులో ఉంటారని వివరించారు. ఏఎంసీలో ఇక నుంచి మెడిసిన్ ప్రొఫెసర్‌కు నెల రోజుల డ్యూటీ ఉంటుందని, ప్రతిరోజు ఉదయం 10.30 గంటలకు అన్ని సూపర్ స్పెషాలిటీ వైద్యులు రోగులకు చికిత్స అందించాలని ఆదేశించారు. ఆరేడు మంది అధికారుల బృందం క్యాజువాల్టీ, ఏఎంసీ, గైనిక్‌తో పాటు ఇతర విభాగాలను రాత్రిళ్లు 12 గంటలకు, తెల్లవారుజామున 2 గంటలకు అకస్మిక తనిఖీలు చేస్తారని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, ఏడీ అనిల్ కుమార్ రెడ్డి, ఏవో శైలజ, అకౌంటెంట్ ఆఫీసర్ కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

కర్నూలు(అర్బన్), జనవరి 1: స్థానిక మౌర్యఇన్ హోటల్‌లో 49 వార్డులోని ప్రకాష్ నగర్, ఎన్ఆర్ పేట ప్రాంతాలకు చెందిన యువకులు, టీడీపీ నాయకుడు విక్రమ్ సింగ్ అధ్వర్యంలో పార్టీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో జిల్లా ప్రజలందరు సంతోషంగా ఉండాలన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. టీడీపీలో చేరిన వారిలో సాయికుమార్, అబ్దుల్లా, యుగంధర్, మెహన్, రసూల్ ఉన్నారు.

కోడుమూరు(రూరల్): మండలంలోని గోరంట్ల గ్రామంలో వైసీపీకి చెందిన పలు కుటుంబాలు సోమవారం టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. టీఎన్‌టీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తిరుమలనాయుడు మాజీ సర్పంచు పరమేశ్వర నాయుడు అధ్వర్యంలో సుమారు 50 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో తీర్థం పుచ్చుకున్నారు. చిన్నమాదన్న, కుర్వ సుధ, నడిపి పుల్లయ్య, కుర్వ రవి, అయ్యన్న, సిద్దయ్య, నాగేంద్ర, భగవాన్‌దాసు, సుంకన్న మాదన్న పాల్గొన్నారు.

బీసీలు రాజకీయంగా ఎదగాలి

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 1: బీసీలు రాజకీయంగా ఎదగాలని ఢిల్లీ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కురువ పరమేశ్వరుడు అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావంతోనే కొంత వరకు బీసీలకు రాజకీయ ప్రాధాన్యం లభించిందన్నారు. 2019లో అనంతపురం జిల్లాలో ముగ్గురు కురువలు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారని, ఈసారి కూడా కర్నూలు జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీలపై ఒత్తిడి తేవాలని అన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, సురేష్, బత్తిన లక్ష్మీనారా యణ, నాగరాజు, దేవేంద్రప్ప, మురళి మనోహర్, సుంకన్న, రవికుమార్, గుడిసె శివన్న, కురువ సంఘం అధ్యక్షుడు పత్తికొండ శ్రీను, సోమలింగం పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌనెల్సింగ్

సి.బెళగల్, జనవరి 1: మండలంలోని కంబందహాల్, పోలకల్లు, బ్రాహ్మణదొడ్డి, తిమ్మనదొడ్డి, ఇనగండ్ల గ్రామాల్లోని రౌడీషీటర్లకు ఎస్ఐ మన్మథవిజయ్ సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని యువత క్షణికావేశాలకు గురై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నారు.

కంది రైతులకు భలే గిరాకీ

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 1: కంది పంటను సాగు చేసిన రైతులకు అదృష్టం కలిసొచ్చింది. ఏపీ రాష్ట్రంలో 50వేల టన్నులను కందులను కొనుగోలు చేసేందుకు నాఫెడ్ ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. సోమవారం కర్నూలు నగరంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మేనేజర్ నవీన్ కుమార్ వివరాలను తెలిపారు. త్వరితగతిన రైతుల నుంచి కందులను కేంద్రం నిర్ణయించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో ఎంత ధర ఉంటుందో అదే ధరకు నాఫెడ్ కొనుగోలు చేసేందుకు నిర్ణయించిందని, ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతుల నుంచి కందులను కొనుగోలు చేసేందుకు డీసీఎంఎస్ సంస్థను నోడల్ ఏజెన్సీగా గుర్తించినట్లు మేనేజర్ నవీన్ కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటం కందుల ధర రూ.10వేలకు పైగానే ధర పలుకుతోంది. దీంతో కేంద్ర ప్రభుత్వ దేశ వ్యాప్తంగా ప్రజల అవసరాల కోసం కందులను భారీ ఎత్తున సేకరించేందుకు చర్యలు చేపట్టిందని అందులో భాగంగానే ఉమ్మడి కర్నూలు జిల్లాలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఉన్న 17 బ్రాంచీల ద్వారా రైతుల నుంచి కందులను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వివరాల కోసం 9291208958, 9381085983 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

అగ్నిప్రమాదంలో పత్తి దగ్ధం

కోడుమూరు(రూరల్), జనవరి 1: మండలంలోని కొత్తూరు గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పత్తి దగ్ధమైంది. బాధితుడి తెలిపిన వివరాలివి. గ్రామానికి చెందిన మల్లికల్ యాదవ్ అనే రైతు ఎనిమిది ఎకరాలు కౌలు తీసుకుని పత్తి సాగు చేశాడు. ఇటీవలే కోతలు పూర్తిచేసి పత్తిని ఇంట్లో నిల్వ చేశాడు. అయితే సోమవారం ఉదయం నిల్వ చేసిన పత్తి నుంచి పొగలు వస్తుడడం గమనించి స్థానికుల సాయంతో మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో సుమారు 20 క్వింటాళ్ల పత్తి, వంటసామగ్రి, దుస్తులు కాలిపో యాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈప్రమాదంలో సుమారు రూ 2 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు రైతు లబోదిబోమన్నాడు.

ఎస్సీ హాస్టల్ విద్యార్థికి తీవ్ర గాయాలు

ఓర్వకల్లు, జనవరి 1 : కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి 40పై ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్ సమీపాన ఉన్న కుందూ వాగు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. కర్నూలు నగరం వార్తా ఆఫీసు సమీపాన ఉన్న ఆ విద్యార్థి ఓర్వకల్లులోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 7వ తరగతి అభ్యసిస్తున్నాడు. సాయంత్రం తల్లిదండ్రులకు ఫోన్ చేసి వసతి గృహానికి రోడ్డు వెంట నడుచుకుంటూ వస్తుండగా.. నంద్యాల నుంచి కర్నూలు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఓర్వకల్లు పీహెచ్‌సీకి తరలించగా.. ఇక్కడి నుంచి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వాహనం కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 1: జిల్లా పరిషత్ ఆవరణలోని సీఈఓ జి.నాసరరెడ్డి నివాసంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డికి డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి, డీఎల్‌పీఓ తిమ్మక్క, ఎంపీడీఓలు, జడ్పీ పరిపాలన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

● నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ భార్గవతేజ నివాసంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, ఎస్ఈ వేణుగోపాల్, ఈఈ శేషసాయి, మెడికల్ హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వరరెడ్డి, రెవెన్యూ అధికారి జునైద్, డిప్యూటి సిటి ప్లానర్ మోహన్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు, డీఈఏఈలు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

● కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ నివాసం వద్ద నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఎంపీ సంజీవ్‌కుమార్‌కు పలువురు అధికారులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

● రాయల్ ఫంక్షన్ హాలులో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కు పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

● కర్నూలు ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి నివాసం వద్ద నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రైవేటు సంస్థల యజమానులతో పాటు పాటు కార్పొరేట ర్లు, నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

● నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఏపీ రైతు సంఘం నాయకులు కలెక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్ఓ మధుసూదన్, ఆర్డీఓ హరిప్రసాద్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వరలక్ష్మి, కేడీసీసీ సీఈఓ రామాంజనేయులతో పాటు కర్నూలు, కల్లూరు, ఓర్వకల్లు తహసీల్దార్లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామక్రిష్ణ, అంజనేయులు, నాగన్నా, కృష్ణ పాల్గొన్నారు.

కర్నూలు(కల్చరల్): నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో సంస్థ ఛైర్మన్ ఎం. సుభాష్ చంద్రబోస్ పాల్గొని కేక్ కట్ చేశారు.

● భాస్కర్‌నగర్‌లోని పాత అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు.

● నగరంలోని కోల్స్ సెంటీనియల్ బాప్టిస్టు, సీఎస్ఐ, రాక్‌వుడ్, స్టాంటన్, సి.క్యాంపులోని ప్రార్థన మందిరం, నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని హోసన్న మందిరం, ఆర్‌సీఎం చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, మత పెద్దలు దైవ సందేశాన్ని తెలియజేశారు.

ఓర్వకల్లు: నూతన సంవత్సర-2024 వేడుకలను మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. మాజీ ఎమ్మెల్యే పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి, నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేకర్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డిలను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఓర్వకల్లులో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, హుశేనాపురంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్.మహబూబ్‌బాషా కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు.

సి.బెళగల్: టీడీపీకి పూర్వవైభవం తెస్తామని పోలకల్లు టీడీపీ ఎంపిటీసీ బాబురావు అన్నారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ గోవిందుగౌడు అధ్వర్యంలో మండలంలోని టీడీపీ నాయకులు మాజీ కేంద్రమంత్రి కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి కలిసి పూలమాలలతో సన్మానించారు.

● మండలం కేంద్రంలో టీడీపీ మాజీ మండల కన్వీనర్ డాక్టర్ తిమ్మప్ప అధ్యక్షతన నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. విష్ణుహమాలీ యూనియన్ నాయకుడు భీమన్న, మాజీ ఎంపీటీసీలు ధనుంజయుడు, రంగన్న, గఫూస్, రాజు, లింగన్న పాల్గొన్నారు.

కల్లూరు: నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరి ఇంట్లో సుఖఃసంతోషాలు నిండాలని టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత, టీడీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ఆకాంక్షించారు. గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డికి పూలబొకేలు, శాలువాలు, మొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాణ్యం, గడివేముల, ఓర్వకల్లు, కల్లూరు అర్బన్, రూరల్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి నివాసంలో నూతన సంవతసర వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఎమ్మెల్యే కాటసాని ఇంటికి పెద్దఎత్తున చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు.

● నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం నంద్యాల చెక్‌పోస్టులోని కార్యాలయంలో నంద్యాల జిల్లా డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కర్నూలు(రూరల్): కర్నూలు నగరంలోని నెహ్రూనగర్ యందు టీడీపీ సీనియర్ నేత ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఇంటి వద్ద కోడుమూరు నియోజకవర్గ టీడీపీ యువనాయకులు బొగ్గుల దస్తగిరి ఆధ్వర్యంలో ఆ పార్టీకి చెందిన గూడూరు, బెళగల్, కోడుమూరు, కర్నూలు రూరల్ మండలాల నాయకులు కార్యకర్తలు భారీగా తరలివచ్చి సోమవారం న్యూఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అందరు కలిసి కేక్‌ను కట్ చేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో విష్ణువర్గీయులు దిన్నెదేవరపాడు సర్పంచు మాధవస్వామి, చందు, గిరిమోహన్, శంకర్, పూడూరు భాష, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు(రూరల్): మండలంలోని గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యకర్తలు పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్‌లను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అమడగుంట్ల వెంకటేశ్వర్లు, సుంకన్న, రాజు, మాదన్న, అనంతులు అనుగొండ పద్మనాభరెడ్డి, బంకు గిడ్డయ్య ప్యాలకుర్తి వెంకటేశ్వర్లు యాదవ్, రాఘవేంద్రయాదవ్, రాజశేఖర్‌యాదవ్ ఉన్నారు.

గూడూరు: నూతన సంవత్సర వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని సీనియర్ టీడీపీ నాయకుడు రాజారెడ్డి, టీడీపీ కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్‌కుమార్, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు చెట్టుకింది మద్దిలేటిలను నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● రాబోవు రోజుల్లో భవిష్యత్ టీడీపీదేనని సీనియర్ టీడీపీ నాయకుడు, గూడూరు నగర పంచాయతీ మాజీ వైస్ ఛైర్మన్ రామాం జనేయులు అన్నారు. సోమవారం గూడూరు పట్టణంలో నగర పంచాయతీ మాజీ వైస్ ఛైర్మన్ రామాంజనేయులును నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.

● తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తెద్దామని పట్టణ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు, కర్నూలు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి దండు సుందరరాజు అన్నారు. సోమవారం గూడూరు పట్టణంలో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని వారిని టీడీపీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. టీడీపీ నాయకులు మన్నన్ బాషా, సుమన్‌బాబు, నాగప్పయాదవ్, నాగరత్నారావు, రవి, హనుమంతు, శ్రీను పాల్గొన్నారు.

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పెరిగిన రోగులను దృష్టిలో ఉంచుకుని ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో పోస్టుల భర్తీకి కృషి చేస్తానని ఆసుపత్రి సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డి అన్నారు. సోమవారం క్యాజువాల్టీ ఎదుట ఉన్న గాంధీ విగ్రహం వద్ద ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...

కర్నూలు(అర్బన్): జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం ఉదయం నుంచి కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే.బాబురావు అధ్యక్షతన కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి కరుణాకర్ బాబు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉండవల్లి వెంకటన్న, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు బీ. బతుకన్న, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ పోతుల శేఖర్, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, ఖాద్రీ బాషా పాల్గొన్నారు.


కోట్లను కలిసిన అమడగుంట్ల టీడీపీ నాయకులు


కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న కె.బాబురావు


గౌరు దంపతులను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు


విష్ణు ఇంటివద్ద కేక్‌ను కట్ చేస్తున్న బొగ్గుల దస్తగిరి, టీడీపీ నాయకులు


ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు, ఉద్యోగులు


వేడుకల్లో పాల్గొన్న ఆసుపత్రి సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డి


ఎమ్మెల్యే కాటసానికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


కేక్ కట్ చేస్తున్న జడ్పీ సీఈఓ

క్యాలెండర్ల ఆవిష్కరణ

కర్నూలు(కల్చరల్), జనవరి 1: నగరంలోని స్వకుళసాళి సమాజ్ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 ఆంగ్లనామ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సమాజ్ ప్రతినిధులు సోమవారం ఆవిష్కరించారు. కోడుమూరు రోడ్డులోని జిష్వేశ్వర, అంబాభవానీ, దత్తాత్రేయ, పాండురంగ స్వామి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ స్వకుళసాళి సమాజం అధ్యక్షుడు కాంబ్లే నగేశ్, ఉపాధ్యక్షుడు మశేకార్ శ్రీనివాసులు, కార్యదర్శి సపారే రామకృష్ణ, కోశాధికారి సరోడే విఠల్‌రావు, ఈసీ మెంబర్ లంబాడే మహదేవ్ పాల్గొని నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర స్వకు ళసాళి సమాజ్ అధ్యక్షుడు సోంసాశే కృష్ణ, ఉపాధ్యక్షులు కే వెంకోబరావు, పి. యువరాజ్, కార్యదర్శులు ఆనందరావు, జే లక్ష్మీనారాయణ, కోశాధికారి పాండే ఈరన్న పాల్గొన్నారు.

కర్నూలు(లీగల్): ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రూపొందించిన 2024 క్యాలెండర్, డైరీలను కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.నాగభూషణం నాయుడు సోమవారం ఆవిష్కరించారు. స్థానిక బార్ అసోసి యేషన్ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఐఏఎల్ రాష్ట్ర నాయకులు కె.రంగనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికాంత్, ఐఏఎల్ నాయకులు బి.చంద్రుడు, చక్రపాణి పాల్గొన్నారు.

కర్నూలు(ఎడ్యుకేషన్): స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రూపొందించిన డైరీ, క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డి ఆవిష్కరించారు.

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లులో కురువ సంఘం మండల అధ్యక్షుడు అల్లాబాబు ఆధ్వర్యంలో సోమవారం కురువ సంఘం క్యాలెండర్లను ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, జిల్లా కోశాధికారి కేసీ నాగన్న ఆవిష్కరించిరు. సంఘం మండల గౌరవాధ్యక్షులు పెద్దయ్య, మండల అధ్యక్షుడు అల్లాబాబు, గ్రామ ప్రజలు స్వాములు, అయ్యన్న, వెంకటేశ్వర్లు, నడిపి స్వాములు, రోళ్లపాడు మద్దిలేటి పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న స్వకుళసాళి సమాజ్ ప్రతినిధులు

● ఓర్వకల్లులోని ఎంఆర్‌సీ భవనంలో సోమవారం ఏపీటీఎఫ్ 2024 క్యాలెండర్, డైరీని ఎంఈవోలు ప్రభావతమ్మ, ఓంకార్ యాదవ్‌లు ఆవిష్కరిం చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్, రాష్ట్ర కౌన్సిలర్ రాఘవరెడ్డి, ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయప్రకాశ్ రెడ్డి, నరేంద్ర, రమణ, రామలింగేశ్వరరెడ్డి, బాషా, సుబ్బయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

న్యూసిటీ: నగరంలో డీవైఎఫ్ఐ నూతన క్యాలెండర్‌ను వైద్యులు లక్ష్మీనారాయణ, వినోద్‌లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్, శిరీష, సహాయ కార్యదర్శి హుస్సేన్ బాషా పాల్గొన్నారు.

శ్రీరాముని పవిత్ర అక్షింతల పంపిణీ

కర్నూలు(కల్చరల్), జనవరి 1: అయోధ్యలో శ్రీరాముని చెంత పూజలు అం దుకున్న పవిత్ర అక్షింతలు పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా బీజేపీ, వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ ఇతర అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో, వివిధ ధార్మిక సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. కర్నూలు నగరంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఒక బృందం వివిధ ప్రాంతాల్లో పవిత్ర అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కోటి యావద్, శ్రీరాములు యాదవ్, భగత్, వెంకటేశ్, ఖాన్, నగరూరు శ్రీకాంత్, వేముల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం అయోధ్య శ్రీరాముని పూజిత పవిత్ర అక్షింతలు వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ టి. ప్రతా పరెడ్డిల ఆధ్వర్యంలో ట్రస్టు బృందం నగరంలోని సరస్వతి నగర్, ఆరోరా నగర్ ప్రాంతాల్లో పవిత్ర అక్షింతలు, అయోధ్య చిత్రపటం, కరపత్రం పంపిణీ చేశారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు శాయ్ క్రీడాకారులు

కర్నూలు(స్పోర్ట్స్), జనవరి 1: ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో జరగనున్న అండర్-19 జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ హ్యాండ్‌బాల్ పోటీలకు శాయ్ హాస్టల్ క్రీడాకారులు అభి, భువనేష్, జనార్దన్, సాగర్‌లు ఎం పికైనట్లు సెంటర్ ఇన్‌చార్జి పీవీ చంద్రశేఖర్, హ్యాండ్‌బాల్ శిక్షకుడు ప్రభాకర్‌లు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడారు.

'కవిత్వం సామాజిక చైతన్యాన్ని ప్రేరేపించాలి'


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న జి.పుల్లయ్య తదితరులు

కర్నూలు(కల్చరల్), జనవరి 1: ఆధునిక కవిత్వం సామాజిక చైతన్యాన్ని ప్రేరేపించే విధంగా ఉండాలని, ఆ దిశగా కవి చౌశా రాసిన 'దుఃఖనది', 'బి.ఫయినోమ్' పుస్తకాలు నిలుస్తున్నాయని రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి. పుల్లయ్య అన్నారు. సోమవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో మహా ప్రస్థానం-మరో ప్రస్థానం సంస్థ ఆధ్వర్యంలో, కర్నూలుకు చెందిన కవి చౌశా రాసిన దుఃఖనది, బి.ఫయినోమ్ కవితా సంపుటిల ఆవిష్కరణ సభ నిర్వహించారు. బి. ఫయినోమ్ పుస్తకాన్ని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, దుఃఖనది పుస్తకాన్ని జి.పుల్లయ్య ఆవిష్కరించారు. అనంతరం విమర్శకులు డాక్టర్ నాగేశ్వరాచారి, డాక్టర్ మల్లెపోగు వెంకటలక్ష్మమ్మ మాట్లాడారు. గాయకులు మహ్మద్ మియా, ఎంపీ బసవరాజు ఆలపించిన అభ్యుదయ గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రముఖ కవి జి.వెంకటకృష్ణ, ఆవుల చక్రపాణి యాదవ్, పాణి పాల్గొన్నారు.

పేదల స్థలాల ఆక్రమిస్తే నాయకుల ఇళ్లపై జెండాలు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 1: పేదల స్థలాల ఆక్రమించుకున్న నాయకుల ఇళ్లపై జెండాలు నాటుదామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం అన్నారు. సోమవారం సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ అంబేడ్కర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల స్థలాలను ఖాళీ చేయించి దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు వైసీపీ ప్రభుత్వమే రౌడీలను పురమాయిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి మహేష్, అమినాబీ, పి.శ్రావణి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 1: తమ డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. ధర్నా చౌకు వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అంతకుముందు ఎస్ఎస్ఏ ఉద్యోగులు పోస్టుకార్డుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఏపీహెచ్ఎంఏ సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, ప్రధాన కార్యదర్శి నారాయణ, రమేష్, ఉశేన్, గోవిందరెడ్డితో పాటు ఎస్ఎస్ఏ ఉద్యోగుల జేఏసీ నాయకులు చంద్రశేఖర్‌రాజు, మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం వైఫల్యం

గూడూరు జనవరి 1: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్, వెలుగు యానిమేటర్స్ (వీవోఏ) ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటప్ప ధ్వజమెత్తారు. గూడూరులో మున్సిపల్ కార్మికుల చేపట్టిన సమ్మె ఏడో రోజుకు చేరుకోంది. సోమవారం గూడూరులోని పాత బస్టాండ్ ప్రాంతంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరంలో కార్మికులకు వెలుగు యానిమేటర్స్ (వీవోఏ) ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటప్ప, నాగేష్ వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దానమన్న, మనోహరమ్మ, బతుకమ్మ, గ్రేసమ్మ, సూర్యశేఖర్ పాల్గొన్నారు.

బుగ్గన అనుచరుల ఆగడాలను అరికట్టాలి

కర్నూలు(అర్బన్), జనవరి 1: డోన్‌లో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అనుచరుల అగడాలను అరికట్టాలని నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు పాలెం సుజాత డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు పెద్దాసుపత్రిలో ముగ్గురు వ్యక్తులపై హత్యకు పాల్పడగా ఇద్దరు మృతి చెందగా మరొకరు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి అనుచరుల ఆగడాలకు హద్దు లేకుండా పోయాయని., ఇసుక మాఫియాతో వారి అరాచకాలను అపలేక పోతున్నారని, ఉంగరానిగుండ్ల చిన్నమది, ఇద్దరి కుమారులు చేసిన హత్యలకు మంత్రి బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ప్రగతి కుబేర్ పథకాన్ని వినియోగించుకోండి

కర్నూలు(న్యూసిటీ), జనవరి 1: సీనియర్ సిటిజన్లకు అత్యధిక వడ్డీ కల్పిస్తున్న ప్రగతి కుబేర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ పీవీ రమణ అన్నారు. సోమవారం ప్రగతి కుబేర్ కొత్త డిపాజిట్ పథకం సంబంధించి రీజినల్ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్లు పి.ఆదినారాయణరెడ్డి, కే.రఘు, ఎం.చంద్రశేఖర్ ఆజాద్ పాల్గొన్నారు.

రేపు రాష్ట్ర వ్యాప్త సమ్మెకు సిద్ధం



రాస్తారోకో నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 1: రాష్ట్రంలో ఉన్న మున్సిపల్ కార్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే జనవరి 3వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు సిద్ధమవుతున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నాయకులు యల్లప్ప, శివ, రాజ్, వీరేష్‌లు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు, వీరేష్, తిమ్మగురుడులు మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 160 మున్సిపాల్టీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో ఏఐటీయూసీతోపాటు టీడీపీ, వైసీపీ అనుబంధ సంఘాలతో కలిసి జనవరి 3న సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజయేంద్ర, నాగప్ప, లక్ష్మన్న, అల్లాబకాష్, భీముడు, సీపీఐ నాయకులు పంపన్నగౌడు, రంగన్న, భాస్కర్‌యాదవ్, దాదావలి, బజారి, నరసింహులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో వెండి రథోత్సవం

మంత్రాలయం, జనవరి 1: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజిత రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం నూతన ఏడాది వేడుకలను పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంగారు, వెండి, పట్టువస్త్రాలు, గులాబి పుష్పాలతో బృందావనాన్ని శోభాయమానంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి రథంపై ప్రహ్లాదరాయలను ఊరేగించారు. అనంతరం ఉత్సవ మూర్తికి ఊంజల సేవ చేశారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కన్నడ నటుడు జగ్గేష్: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కన్నడ ప్రముఖ సినీ నటుడు, రాజ్యసభ సభ్యుడు జగ్గేష్ సోమవారం జనవరి 1 సందర్భంగా మంత్రాలయం వచ్చారు. ఈయనకు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాస రావు, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. యన గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



జొహరాపురంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఆస్పరి, జనవరి 1: మండలంలోని జొహరాపురం గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, ఆలూరు అసెంబ్లీ కన్వీనర్ వెంకట్ రాముడు నిర్వహించారు. సోమవారం వారు మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కాశమ్మ, మండల బీజేపీ సహాయ కార్యదర్శి చక్రాల శ్రీనివాసులు, నరసప్ప, తులసి, రాముడు, గోవిందస్వామి, కరుణాకర్, వీరేష్, రవికుమార్, నాగరాజు, రామదాసు, లక్ష్మణ్ణ పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యస్థాపనకు కృషి చేయాలి

ఎమ్మిగనూరు, జనవరి 1: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి బహుజనులను గెలిపించడం ద్వారా బహుజన రాజ్య స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఆర్.జె. మల్లికల్ అన్నారు. సోమవారం పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో ఎమ్మిగనూరు ఇన్‌చార్జి యర్రన్న, నియోజకవర్గ అధ్యక్షులు నాగరాజుల ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన రాఘవేంద్ర వాల్మీకిని పార్టీకిలోకి చేర్చుకున్నారు. పార్టీ కండువాలు కప్పి సాదారంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణ పేదలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, జిల్లా ఇన్‌చార్జి వనుమన్న, జిల్లా అధ్యక్షులు జైరాజ్, నాయకులు రవికుమార్, నాగేష్, ప్రసాద్, బంగారప్ప, నాగన్న, యాకోబు, హనుమన్న, చంద్ర పాల్గొన్నారు.

రేపు తలనీలాల వేలం

మద్దికెర, జనవరి 1: మండలంలోని పెరవలి గ్రామంలోని రంగనాథ స్వామి దేవాలయంలో ఈ నెల 3వ తేదీ ఉదయం 11 గంటలకు తలనీలాలు ఏడాది పాటు పోగు చేసుకోడానికి బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ఈడిగ దస్తగిరిగౌడు, ఈవో చంద్ర శేఖర్ రెడ్డి సోమవారం తెలిపారు. ఈ-టెండర్, షీల్డ్ కొటేషన్ కూడా నిర్వహిస్తున్నటు తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు రూ.1లక్ష ధరావత్తు చెల్లించాలన్నారు.

ముద్రగడ కుల ద్రోహి : కాపు సంఘం

మద్దికెర, జనవరి 1: మాజీ మంత్రి, కాపు సంఘం నాయకుడు ముద్రగడ పద్మనాభం కులద్రోహి అని రాష్ట్ర కాపు సంఘం నాయకులు వైపీ వీరన్న ఆరోపించారు. సోమవారం మద్దికెరలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాపులకు ఎంతో అన్యాయం చేసిన వైసీపీకి వత్తాసు పలకడం సిగ్గు చేటన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కాపులకు పలు సంక్షేమ పథకాలు అమలు చేసినప్పటికీ ముద్రగడ కాపులకు న్యాయం చేస్తామంటూ ఉద్యమాలు చేయించి కులాన్ని తప్పు దోవ పట్టించాడన్నారు. కాపు రిజర్వేషన్ తన ధ్యేయమంటూ ఇన్నాళ్లు మాట్లాడిన ముద్రగడ ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

యూత్ కాంగ్రెస్ స్టేట్ చైర్‌పర్సన్‌గా క్రాంతి నాయుడు

పత్తికొండ టౌన్, జనవరి 1: ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ రీసెర్చ్ విభాగం రాష్ట్ర చైర్‌పర్సన్‌గా పత్తికొండ ప్రాంతానికి చెందిన క్రాంతి నాయుడును నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పత్తికొండ పట్టణానికి చెందిన క్రాంతినాయుడు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. జాతీయ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కృష్ణ, జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వీవీ శ్రీనివాసులు క్రాంతినాయుడుకు ఈ బాధ్యతలు అప్పజెబుతూ నియామక పత్రాన్ని జారీ చేశారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ఎమ్మిగనూరు, జనవరి 1: నూతన సంవత్సర వేడుకలను ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో నూతన సంవత్సర వేడుకలను యువతీ యువకులు కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ఇంటిదగ్గరకు పట్టణం, ఎమ్మిగనూరు మండలం, నందవరం, గోనేగండ్ల మండలాల నాయకులు భారీగా తరలివచ్చి గజమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తొక్కిసలాట జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేయటంతో వందలాది మంది క్యూలైన్‌లో నిలబడి మరీ శుభాకాంక్షలు తెలిపారు. వచ్చిన వారందరికి పార్టీ నాయకులు మిఠాయి పంచారు. అలాగే టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జీ పాలకుర్తి తిక్కారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు మంత్రాలయం, కౌతాళం, కోసిగి, పెద్దకడుబూరు మండలల నుంచి భారీగా తరలి వచ్చారు. దీంతో గాంధీనగర్‌లోని రహదారులు జనంతో కిక్కిరిశాయి. ఆయా మండలాల నుంచి వచ్చిన వారంత పాలకుర్తి తిక్కారెడ్డిని, ఆయన తనయుడు దివాకర్ రెడ్డిని, తమ్ముడు శ్రీనివాసరెడ్డిని పూలమాలలతో ముంచెత్తారు. భారీ గజమాలలు వేసి, కేక్‌లు కట్‌చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డిని కర్నూలులో ఎమ్మిగనూరు టీడీపీ నాయకులు, అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శిల్పా కాలనీలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఇంటి దగ్గర ఆయన తనయుడు వైసీపీ సీనియర్ నాయకలు జగన్మోహన్‌రెడ్డిని నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు కలిసి పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వీరశైవ లింగాయత్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ రుద్రగౌడ్, ఆయన సోదరుడు పురుషోత్తమగౌడ్‌ను వారి అభిమానులు, పార్టీనాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హెచ్‌బీఎస్ కాలనీలో బీజేపీ ఇన్‌చార్జీ కేఆర్ మురహరి రెడ్డిని ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దేవి నివాస్‌లో వీరశైవ లింగాయత్ సంఘటన వేదిక రాష్ట్ర అధ్యక్షులు దేవేంద్రగౌడ్‌ను నాయకులు, అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్‌గాంధీ ఫొటోను పట్టణంలో ఊరేగిస్తూ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీనారాయణరెడ్డి ఇంటి దగ్గరకు చేరుకొని ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీ సీతారామయ్యను పలువురు నాయకులు, పట్టణ వాసులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆమ్‌ఆద్మీ పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఇన్‌చార్జి కాశింనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతేగాక ప్రభుత్వ అధికారులను, పోలీసు అధికారులను ప్రజలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మల్లెల గ్రూప్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజుకు అభిమానులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలో వెలసిన ఆలయాల్లో ప్రజలు ప్రత్యేకపూజలు చేశారు. అలాగే చర్చిల్లో క్రైస్తవసోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి తిమ్మాపురం టీడీపీ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం బీవీ జయనాగేశ్వరరెడ్డిని కర్నూలు పార్లమెంట్ కురువ సాధికార కమిటీ మెంబర్‌తో పాటు గ్రామంలోని కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రాలయం: మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డిలకు పులమాలలతో తెలుగు తమ్ముళ్లు పెద్ద ఎత్తున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ జడ్పీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు తిక్కారెడ్డి సోదరులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విదంగా మంత్రాలయం గెస్టుహౌస్ వద్ద ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తన కార్యకర్తలతో, నాయకులతో నిరాడంబరంగా నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. మాధవరంలో టీడీపీ జిల్లా సీనియర్ నాయకులు రాఘవేంద్ర రెడ్డి, రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డిలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు గజమా లతో సన్మానించారు. బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, క్రిష్ణమోహన్ రెడ్డిలకు బాణాసంచా, డీజేలతో వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని సీఎస్ఐ చర్చిలో కొత్త సంవత్సర వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంత్రాలయం డివిజనల్ చైర్మన్ రెవ.వేద నాయకం, మాధవరం పాస్టర్ రెవ.ఫిన్ని పురుషోత్తం, విజయకుమార్, ఎస్‌డి రాజన్న, యేసయ్య, మేరీ మేఘన ఆధ్వర్యంలో కొత్త సంవత్సరం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

నందవరం: మండలంలో జనవరి వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ దేశాయి మాధవరావు ఇంటికి వచ్చి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన నందవరం నుంచి భారీ ఊరేగింపుతో మాజీ ఎమ్మెలే బీవీ జయ నాగేశ్వరరెడ్డిని కలిసి వేడుకలు చేసుకునేందుకు వెళ్లారు. అలాగే మాజీ జడ్పీ మాజీ చైర్మన్ పుష్పావతి, నాగరాజుగౌడు, కాశీంవలిలకు ఆగ్రామ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

క్రిష్ణగిరి: మండలంలో నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. కర్నూలు, కంబాలపాడు, డోన్‌లలో ఉన్న ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్, టీడీపీ పత్తికొండ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు, మాజీ జడ్పీటీసీ కేఈ జయన్నలను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎంపీపీ కంగాటి వెంక ట్రామిరెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు పత్తికొండ, చెరుకులపాడుకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

గోనెగండ్ల: గోనెగండ్లతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ కేంద్ర మంత్రి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఇంటి దగ్గరకు వెళ్లి గోనెగండ్ల టీడీపీ నాయకులు టీడీపీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, సర్పంచ్ హైమావతి, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, చెన్నలరాయుడు, నాయక్ షాషావలి, దరగల మాబు, అక్బర్‌బాషా, సత్య, బాబునాయుడు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పూల మాలతో సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి గోనెగండ్ల నాయకులు నజీర్‌సాహెబ్, తిరుప తయ్యనాయుడుతో పాటు పలువురు టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గోనెగండ్ల ఎంపీపీ నసూరుద్దీన్, మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు బందేనవాజ్ 2024 కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీపీలు కృష్ణారెడ్డి, గాజులదిన్నె హనుమంతులను టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

పెద్దకడుబూరు: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలు ప్రజలు, నాయకులు ఘనంగా జరుపుకున్నారు. టీడీపీ తెలుగు రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రమాకాం తరెడ్డికి కార్యకర్తలు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైసీపీ నాయకులు రామ్మోహ న్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలకు ఆయా గ్రామాల కార్యకర్తలు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆలూరు: ఆలూరు పట్టణంలోని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం మల్లికార్జున, శశిసుధ ఆధ్వర్యంలో వారి ఇంట్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతం కేక్ కట్ చేశారు.

- ఆలూరు మాజీ టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం శివప్రసాద్, జ్యోతి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు డీజే సౌండ్ సిస్టంతో బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం కేక్ కట్ చేశారు.
- ఆలూరు మాజీ టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ ఆధ్వర్యంలో ఆలూరు ఉమా కళ్యాణ మండపంలో నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కురువ జయరాం, నాయకులు మోక మల్లయ్య, పంపావతి, వీరన్న గౌడ్, కత్తి రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆదోని: ఆదోని మండలం మండగిరి గ్రామంలో పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో విద్యార్థుల సమక్షంలో సబ్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ కేక్ కట్ చేశారు.

చిప్పగిరి: చిప్పగిరిలో జడ్పీటీసీ విరుపాక్షి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తల మధ్య ఆయన కేక్‌ను కట్ చేశారు. అలాగే మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ అధ్వ ర్యంలో గుమ్మనూరులో వేడుకలను జరుపుకున్నారు. అలాగే ఎంపీపీ జూటూరు హేమలత, మండల వైసీపీ కన్వీనర్ మారయ్య ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, బిణిగేరి, ములుగుందం., బీలేకల్, కైరుపల, తంగరడోన గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ప్రజలు, టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకు న్నారు. క్రైస్తవులు చర్చిలకు, హిందువులకు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు.

పత్తికొండ: నూతన సంవత్సర వేడుకలు పత్తికొండలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబును ఆ పార్టీ కార్యకర్తలు కలసి శుభాకాంక్షలు తెలిపారు. వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, నాయకుల కోసం ప్రత్యేకంగా భోజనసదుపాయాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటలవరకు టీడీపీ కార్యాలయం ముందు ట్రాఫిక్‌జాం ఏర్పడింది. జడ్పీ మాజీచైర్మన్ బత్తిని వెంకట్రాముడు, మద్దికెర మాజీ జడ్పీటీసీలు పురుషోత్తంచౌదరి, రాజన్నయాదవ్, పత్తికొండ మాజీ జడ్పీటీసీ హోటల్ శ్రీనివాసులులతోపాటు పత్తికొండ, మద్దికెర, తుగ్గలి మండలాల సీనియర్ నాయకులు కేఈ శ్యాంబాబుకు శుభాకాం క్షలు తెలిపారు. ఆర్డీవో రామలక్ష్మీ, తహసీల్దార్ విష్ణుప్రసాద్, డీఎస్పీ శ్రీనివాసరెడ్డిలకు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కలసి పూలమాలలతో శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి ఇంటికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి శుభాకాం క్షలు తెలిపారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డికి టీడీపీ శ్రేణులు పూలమాలలో శుభాకాంక్షలు తెలిపారు.

పత్తికొండ టౌన్: పత్తికొండ పట్టణంలో నూతన సంవత్సరం వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఎమ్మెల్యే శ్రీదేవికి పార్టీ శ్రేణులు, అధికారులు వివిద వర్గాల ప్రజలు తరలివచ్చి పుష్పగుచ్చాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైసీపీ నేతలు రామచంద్రరెడ్డి, నాగరత్నమ్మలకు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డికి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌కు వైసీపీ జిల్లా నాయకులు పోచంరెడ్డి మురళీధర్ రెడ్డి, పెద్ద ఎత్తున ప్రజలు హాజరై నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సీపీఐ కార్యాలయం వద్ద ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, భీమలింగప్పలకు గజమాలతో పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపాయి.

తుగ్గలి: నూతన సంవత్సర వేడుకలను సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులకు కార్యకర్తలు, ప్రజలు పూలమాలలు వేసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండల అధికారులను పుష్పగుచ్చాలు అందించి సన్మానించారు. మాజీ రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ తుగ్గలి నాగేంద్రను అభిమానులు సన్మానించి న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మండల నాయకులు పత్తికొండకు వెళ్లి కేఈ శ్యాంబాబుకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైసీపీ నాయకులు ఎమ్మెల్యే శ్రీదేవికి ఆ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి గ్రామాల్లో 2024 నూతన సంవత్సర వేడుకలను ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా జరుపుకున్నారు. జడ్పీటీసీ సభ్యుడు డి.మురళీధర్ రెడ్డి, ప్రముఖ దాత లు పారా రామచంద్రప్రసాద్, పారా విశ్వనాథ్ (చిట్టెన్న), ఎంపీపీ డి. అనిత యాదవ్, మాజీ జడ్పీటీసీ సభ్యులు పి.పురుషోత్తంచౌదరి, జమేదార్ రాజన్న యాదవ్, టీడీపీ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు తదితరుల ఇళ్లకు వెళ్లి పుష్పగుచ్చాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


క్రిష్ణగిరిలో కేఈ శ్యాంబాబుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు



పత్తికొండలో ఎమ్మెల్యే శ్రీదేవి ఆధ్వర్యంలో న్యూ ఇయర్ వేడుకలు


ఎమ్మిగనూరులో తిక్కారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు


బీవీకి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు


టీడీపీ నాయకులకు గజమాలతో సన్మానం


ఆలూరులో కేక్ కట్ చేస్తున్న మాజీ టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్


కేక్ కట్ చేస్తున్న టీడీపీ మాజీ ఇన్‌చార్జి వైకుంఠం శివప్రసాద్, జ్యోతి



వేడుకల్లో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం మల్లికార్జున


చిప్పగిరిలో వేడుకల్లో పాల్గొన్న జడ్పీటీసీ విరుపాక్షి


బిణిగేరిలో..


ఆదోనిలో..

'జగన్‌కు మంచి బుద్ధిని ప్రసాదించాలి..'

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 1: 'నీ కుమారుడు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌కు మంచి బుద్ధిని ప్రసాదించమని' మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు ఇస్మాయిల్, లక్ష్మన్న, మల్లికార్జున వైఎస్సార్ విగ్రహానికి మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు వినతిపత్రం అందించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె సోమవారంతో 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వైఎస్సార్ సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించి వైఎస్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు రాముడు, రాజు, మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

శ్రీరాముని పవిత్ర అక్షింతలు పంపిణీ

ఆదోని టౌన్, జనవరి 1: అయోధ్యలోని శ్రీరాములు వారి ఆలయానికి సంబంధించిన పవిత్ర అక్షింతలను పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో సోమవారం ఇంటింటికీ పంపిణీ చేయడం ప్రారంభించారు. అంతకుముందు అక్షింతలను ఆలయంలో స్వామి వారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలను నిర్వహిం చారు. బ్రాహ్మణ సంఘం కార్యదర్శి దేశాయి చక్రవర్తి పాల్గొన్నారు.

మద్దికెర: అయోధ్య రామయ్య అక్షింతలను మండలంలోని పెరవలి గ్రామంలో ఈ నెల 18వ తేదీ నుంచి ప్రతి ఇంటికి అక్షింతలను అందజేయనున్నట్లు ప్రముఖ దాత పారా విశ్వనాథ్ తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జనవరి 22న పెరవలి రంగనాథ స్వామి ఆలయ ముందు శ్రీరాముడు, హనుమంతుడి విగ్రహాల ఆవిష్కరణ ఉంటుందని అన్నారు.

అయోధ్య అక్షింతలు ఉరేగింపు

దేవనకొండ, జనవరి 1: మండలంలోని నెల్లిబండ గ్రామంలో అయోధ్య శ్రీరామ అక్షింతలను విచారమంచ్ అధ్వర్యంలో ఉరేగించారు. అక్షింతలలో పాటు గోమాత, గ్రామంలోని చిన్నారులు ,యువతులు కలశాలతో ఉరేగింపు చేసి హిందుత్వ గొప్పతనం తెలియజేశారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, గ్రామవికాస్, ఎస్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.


అక్షింతలను ఉరేగిస్తున్న గ్రామస్థులు

అంగన్‌వాడీల నిరసన

ఆదోని, జనవరి 1: తమ డిమాండ్లను పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సోమవారానికి 21వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ, వరలక్ష్మి, సరోజ, జానకి మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లను ఓపెన్ చేయకూడదన్నారు. రోడ్డుపై అంగన్‌వాడీలు కబడ్డీ ఆడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, తిప్పన్న, గోపాల్, లక్ష్మన్న, కృష్ణమూర్తి, రామాంజనేయులు, పద్మా, రేణుక, సరోజ, సోమక్క, గీత పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: అంగన్‌వాడీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే కంచికామాక్షి, మధుర మీనాక్షి, కనకదుర్గమ్మ సాక్షిగా వారి ఉసురు పోసుకొని ఈ ప్రభుత్వం అష్టకష్టాల పాలవుతుందని సీఐటీయూ ఆధ్వర్యంలో సోదమ్మ వేషధారణలో 21వ రోజు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కేపీ నారాయణ స్వామి, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ నాయకులు జయశ్రీ, బాలరంగమ్మ, పుష్పవతి, పరిమళమ్మ మాట్లాడారు. అంగన్‌వాడీలకు సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, కృష్ణ, నాగరాజు, మైన, గోవర్ధన్ మద్దతు తెలిపారు.

ఎమ్మిగనూరు రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన సమ్మె సోమవారంతో 21వ రోజుకు చేరుకుంది. 21వ రోజు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమ్మెకు కళాకారుల సంఘం నాయకులు కేశవులు, కులవివక్ష సంఘం నాయకులు దేవసహాయం, రాజు, ఆంథోని, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీపీఐ ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు సురేష్, అజిత్ కుమార్, విజయ్, రంగన్న, విజయేంద్ర, మహేంద్రబాబు మద్దతు తెలిపారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సోమప్ప సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టారు. కళాకారుల బృందం కేశవయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విదానాలను ఎండగడుతూ పాటలు పాడారు. అనంతరం వైఎస్ఆర్ సర్కిల్‌లో వైఎస్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కృష్ణవేణి, నాగశిరోమణి, గ్రేషమ్మ, గోవర్ధనమ్మ, శైలజ, నీరజ పాల్గొన్నారు.


ఆలూరులో అంగన్‌వాడీల నిరసన

కారు దగ్ధం..
ప్రాణాలతో బయటపడిన దంపతులు

మంత్రాలయం, జనవరి 1: మంత్రాలయం సమీపంలో ఎమ్మిగనూరు ప్రభుత్వ కంటి వైద్యనిపుణులుగా పని చేస్తున్న చిరంజీవికి చెందిన కారు సోమవారం రాత్రి 10 గంటలకు దగ్ధమైంది. మంత్రాలయం ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తెలిపిన వివరాల మేరకు ఎమ్మిగనూరు డాక్టర్ చిరంజీవి తన భార్యతో రాయచూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా.. ఇండియన్ పెట్రోల్ బంకు సమీపంలో కారు నుంచి పొగలు రావడంతో కారును పక్కకు ఆపి పరిశీలించేలోగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. పెట్రోల్ బంకు సమీపంలో ఉండటంతో పెట్రోల్ బంకు యజమానులు, సిబ్బంది మంత్రాలయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ వేణుగోపాల్‌రాజు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు యత్నించారు. అయినా మంటలు అదుపు కాకపోవడంతో ఎమ్మిగనూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అప్పటికే కారు పూర్తిగా కాలి బూడిదైంది.

కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

ఆలూరు రూరల్, జనవరి 1: మదాసి, మాదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలని మదాసి, మాదారి కురవ సంఘం మాజీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు మోహన్ ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం ఆలూరులో మదాసి, మాదారి కురువ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మోహన్ ప్రసాద్, నాయకులు కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌మోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగ, మల్లప్ప, డైరెక్టర్ బజారప్ప, కమ్మరచేడు దేవేంద్రప్ప, బసవరాజు, సర్పంచి సుధాకర్, గిరి. అరికేర ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ, చంద్ర పాల్గొన్నారు.